క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పి.గన్నవరం: మండలంలోని రాజులపాలెం ఆర్బీకే వద్ద శనివారం సర్పంచ్ కొంబత్తుల ఏసు బాబు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అయ్యగారి లక్ష్మీనర్సింహమూర్తి అనే రైతు నుంచి ధాన్యం సేకరించి మిల్లుకు తరలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కళ్యాణ్‌కుమార్, సొసైటీ సీఈఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

అంబాజీపేట: వరి పంటలో రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. ఇరుసుమండలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఏఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ పొలంబడిలో వివరించినట్లుగా 40 రోజుల వరకు ఎటువంటి పురుగు మందులు వాడకపోవడం వల్ల రూ.4 నుంచి రూ.5 వేల వరకు ఖర్చు ఆదా చేశారని రైతులకు వివరించారు. సమావేశంలో రైతులు దంతులూరి వెంకట సత్యనారాయణరాజు, దొమ్మేటి రాధా సూర్యనారాయణ, దూనబోయిన రాంబాబు, కూనపురెడ్డి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రాజేశ్వరస్వామి ఆలయంలో నేడు ప్రారంభోత్సవాలు

అంబాజీపేట: మాచవరంలో వేంచేసియున్న పార్వతీ సమేత రాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పలు ప్రారంభోత్సవాలు జరగనున్నాయి. మాచవరానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పద్మావతి ట్రేడర్స్, పద్మావతి వెంచర్స్ అధినేత మైపాల తాతాజీ దంపతులు నిర్మించిన ఆలయ తూర్పు మండపం, గాలి గోపురం, ప్రహరి, యాగశాలలను ఆదివారం ఉదయం 9.45 నిమిషాలకు ప్రారంభించనున్నారు. ఆలయ గాలి గోపురాన్ని కొవ్వూరుకు చెందిన మహా మహోపాధ్యాయ దోర్భల ప్రభాకర శర్మ ప్రారంభిస్తారని, ఉదయం 11 గంటలకు లక్షపత్రి పూజ, చండీయాగం, రాత్రి హైదరాబాద్‌కు చెందిన దెందులూరి సర్వేశ్వర సీతారామ శర్మ ప్రవచనాలు నిర్వహించబడతాయని తాతాజీ తెలిపారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించనున్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

మామిడికుదురు: కూల్‌డ్రింక్ కోసం వచ్చిన మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరించుకుపోయిన సంఘటన ఈదరాడలో జరిగింది. ఈ చోరీకి సంబంధించి బాధితురాలు కోన శేషారత్నం తెలిపిన వివరాలిలా.. గురువారం రాత్రి 7.50 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు మంకీ క్యాపుతో శేషారత్నం కూల్‌డ్రింక్ షాపు వద్దకు వచ్చారు. ఒక వ్యక్తి బైక్ దిగి వచ్చి రూ.20 పల్పీ ఆరెంజ్ డ్రింకు తీసుకుని రూ.50 నోటు ఇచ్చాడు. డ్రింకు డబ్బులు తీసుకుని మిగిలిన చిల్లర ఇస్తుండగా ఆమె మెడలోని లాకెట్‌తో కూడిన ఆరు కాసుల బంగారు గొలుసు లాక్కుని బైక్‌పై ఇద్దరు వ్యక్తులు పారిపోయారు. చోరీకి గురైన బంగారం విలువ రూ.మూడు లక్షలు ఉంటుందని శేషారత్నం వాపోయారు. బాధితురాలు శేషారత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు దీనిపై కేసు నమోదు చేశామని నగరం హెచ్‌సీ పి.శ్రీదేవి శనివారం తెలిపారు. సంఘటన స్థలాన్ని పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్ పరిశీలించారు. ఈ చోరీపై సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో ధర్మపథం కుంకుమ పూజలు

ఆలమూరు: రాష్ట్ర దేవదాయశాఖ ఆదేశాల మేరకు హిందూ ధర్మ ప్రచార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని కలవచర్లలో శనివారం కుంకుమ పూజలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చింతలూరులోని నూకాంబిక అమ్మవారి ఆలయ కమిటీ పర్యవేక్షణలో స్థానిక వాకులమ్మ-పోలేరమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో వేద పండితులు పి.నరసింహమూర్తి మంత్రోచ్చారణల మధ్య ఈపూజలను నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళ భక్తులు విచ్చేసి పూజలు నిర్వహించి భక్తి పారవశ్యం చెందారు. మహిళ భక్తులు ప్రవచించిన లలితా సహస్ర పారాయణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దేవదాయశాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ ధర్మపథం కార్యక్రమాన్ని పురస్కరించుకుని భక్తులకు పూజా సామగ్రిని ఆలయ ఈవో ఉండవిల్లి వీర్రాజు సమకూర్చడంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు.

దేదీప్యమానంగా స్వామి కల్యాణం

మామిడికుదురు: ఆపద్బాంధవుడిగా, అనాథ రక్షకుడిగా పూజలందుకుంటున్న అప్పనపల్లి బాలబాలాజీ స్వామి కల్యాణం గోగన్నమఠంలో శనివారం దేదీప్యమానంగా జరిగింది. అప్పనపల్లిలో కొలువైన స్వామి స్వయంగా తమ స్వగ్రామానికి రావడం తమకు ఎంతో ఆనందంగా ఉందని భక్తులు ఆనందంతో మురిసిపోయారు. ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా చివరి రోజు అప్పనపల్లి బాలబాలాజీ స్వామి కల్యాణోత్సవం గోగన్నమఠంలో కనులపండువలా జరిగింది. వేద పండితుడు జోస్యుల సోమయాజులు స్వామి, అమ్మవార్ల శిరస్సుపై జీలకర్ర, బెల్లం పెట్టి కల్యాణ క్రతువును వైభవంగా జరిపించారు. ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ పర్యవేక్షణలో కల్యాణం జరిగింది. ఎంపీపీ కుసుమ వనజకుమారి, సర్పంచ్ అల్లు విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ సాగి పీఆర్‌వీఎస్ఎస్ నర్సింహవర్మ, వైస్ ఎంపీపీ భూపతిరాజు లక్ష్మి, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

పథకాల అమలు చూసి ఓర్వలేకే విమర్శలు

- ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- అంకంపాలెంలో పలు అభివృద్ధి పనులు

ఆత్రేయపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించడం చూసి ఓర్వలేకే పచ్చనేతలు విమర్శలు చేస్తున్నారని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అంకంపాలెంలో మాజీ సర్పంచ్ గారపాటి అబ్బులుచౌదరి, గారపాటి గంగారామ్‌చౌదరి ఆధ్వర్యంలో ఎస్సీ ఏరియాలో రూ.8.60 లక్షల మండల పరిషత్, ఎన్ఆర్‌జీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైన్ పనులను ప్రారంభించారు. సీఎం జగన్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికి పూర్తి స్థాయిలో ప్రతి సంక్షేమం పథకం మునుపెన్నడూ లేని విధంగా అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాలు వార్షిక క్యాలెండర్ ప్రకారం లబ్ధిదారులకు ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నేరుగా నగదు బదిలీని అమలు చేసిందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ప్రజల బాగోగులు గాలికి వదిలేసి కాగితాల్లో అంకెల గారడీ చేసే ప్రభుత్వం తమది కాదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఏదో విధంగా లబ్ధి చేకూరేలా సీఎం జగన్ ప్రయత్నిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు కొల్లి శ్యాంసన్, కరుటూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


అంకంపాలెంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రక్తదానం


రక్తదానం చేస్తున్న యోగా ఆశ్రమం సభ్యులు

రావులపాలెం: స్థానిక స్వామి వివేకానంద యోగా ఆశ్రమానికి చెందిన 14 మంది సభ్యులు శనివారం రక్తదానం చేసినట్లు యోగా గురువు శ్రీనివాస్ తెలిపారు. వివిధ కారణాల నిమిత్తం రక్తం అవసరం అయిన వారికి తమ సభ్యులు అమలాపురంలోని ఏరియా హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ వద్ద రక్తదానం చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు.

‘ఆడుదాం ఆంధ్ర’ విజయవంతం చేయండి

కొత్తపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ‘ఆడుదాం ఆంధ్ర’ గేమ్స్ విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు సూచించారు. వచ్చే నెల 15 నుంచి నిర్వహించే ×ఆడుదాం ఆంధ్ర® గేమ్స్ నిర్వహణపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మహేశ్వరరావు అధ్యక్షతన గ్రామ సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది, వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ఈ కార్యక్రమం గురించి వివరించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ నిర్వహించే ఈ కార్యక్రమంలో వాలీబాల్, క్రికెట్, కబాడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడలు నిర్వహిస్తారన్నారు. వచ్చే నెల 15 నుంచి 20 వరకూ గ్రామ స్థాయిలో, 21 నుంచి జనవరి 4 వరకూ మండల స్థాయిలో, 5 నుంచి 10 వరకూ నియోజకవర్గ స్థాయిలో, 11 నుంచి 21 వరకూ జిల్లా స్థాయిలో, 22 నుంచి 26 వరకూ రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుగుతుతాయని వివరించారు. 15 సంవత్సరాలు పైబడిన వారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. గ్రామ స్థాయి విజేత టీమ్‌లు మండల స్థాయికి, మండల స్థాయి విజేత టీమ్‌లు నియోజకవర్గ స్థాయికి వెళతారన్నారు. నియోజకవర్గ స్థాయి నుంచి విజేత టీమ్‌లకు నగదు బహుమతులు ఇస్తారన్నారు. ఈ పోటీలు నిర్వహణలో పీడీ, పీఈటీలకు వలంటీర్లు సహాయకులుగా వ్యవహరించాలని సూచించారు. డిసెంబర్ 15 లోపు ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, ఎంఈఓ-2 కె.లీలావతి, ఎంఎస్‌డీఓ వైఎస్ఎస్ ఉషారాణి, పంచాయతీ కార్యదర్శులు మంగిపూడి రాంబాబు, సుంకర రెడ్డినాయుడు, పి.సత్తిబాబు, శాంతి, పీడీలు ఎస్‌వీ రమణ, రఘుప్రియ, రజని, మల్లేశ్వరరావు, అగ్నికుమార్, భువన, వర్మ తదితరులు పాల్గొన్నారు.


‘ఆడుదాం ఆంధ్ర’ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మహేశ్వరరావు

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. నర్శిపూడిలో రూ.20 లక్షలతో చేపట్టనున్న రెండు రామాలయాల అభివృద్ధి పనులను శనివారం ఆయన ప్రారంభించారు. టీటీడీ శ్రీవాణి ట్రస్టు నుంచి మంజూరు చేసిన రూ.పది లక్షలతో శెట్టి రామాలయం నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అలాగే గ్రామస్తుల సహకారంతో తూర్పు వీధి రామాలయం ఆవరణలో ఏర్పాటు చేయనున్న షెడ్డు నిర్మాణానికి అంకురార్పణ చేశారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత చల్లా వెంకట సుబ్రహ్మణ్యం, సర్పంచ్ కందిబొట్ల శ్రీనివాసు, ఎంపీటీసీ మేడిశెట్టి సుబ్బారావు, చల్లా పద్మ, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.


నర్శిపూడిలో రామాలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

సముద్రంలో తిరగబడిన బోటు

మామిడికుదురు: సముద్రంలో చేపల వేట ముగించుకుని తిరిగి వస్తుండగా కరవాక సముద్రంలో అన్నా చెల్లెళ్ల గట్టు వద్ద కెరటాల ఉధృతికి శుక్రవారం అర్ధ రాత్రి బోటు తిరగబడింది. బోటులో ఉన్న ఆరుగురిలో సందాడి వెంకటేశ్వర్లు బోటు కింద ఉండిపోయాడు. మిగిలిన మత్స్యకారులు అతడ్ని అతికష్టం మీద బోటు నుంచి బయటకు తీసుకు వచ్చారు. వెంకటేశ్వర్లు కాలు విరిగిపోవడంతో అతడ్ని శనివారం అమలాపురం ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ప్రమాదం నుంచి వెంకటేశ్వర్లుతో పాటు బోటు యజమాని సంగాని సోమరాజు, సురేష్, శ్రీను, రేకాడి శ్రీను, పొన్నమండ శ్రీను ఈత కొట్టుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. బోటుతో పాటు ఇంజిన్ దెబ్బతిందని, వలలు కొట్టుకు పోయాయని, వేటాడిన చేపలు సైతం కొట్టుకు పోయాయయని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. ప్రాణనష్టం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

నాలుగున్నరేళ్లుగా పారదర్శక పాలన

- టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలోకి..
- పార్టీ కండువాలు కప్పిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: గడిచిన నాలుగున్నరేళ్లలో కొత్తపేట నియోజక వర్గంలో కులాలు, మతాలకు అతీతంగా రాజకీయాలు చేయకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని అందించామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శనివారం ఆత్రేయపురం మండలం అంకంపాలెంలో సుమారు 60 కుటుంబాలకు చెందిన టీడీపీ, జనసేన పార్టీ నాయకులు వైఎస్సార్ సీపీలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు. మాజీ సర్పంచ్ గారపాటి అబ్బులు చౌదరి, గారపాటి గంగరామ్ చౌదరి ఆధ్వర్యంలో అంకంపాలేనికి చెందిన యడ్ల సత్యనారాయణ, తీట్ల శ్రీను, యడ్ల అనంతలక్ష్మి, సతీష్, లావణ్య, చిగురుపాటి సత్తిపండు, దాకి శ్రీను, కుసుమే ప్రసాద్, చింతా శేషయ్య, యడ్ల స్వర్ణ, నల్లి బాబి, ఇసుకపట్ల నాని తదితరులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీలకు అతీతంగా అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పారదర్శకమైన పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పరిపాలన నచ్చి నేడు అంకంపాలెంలో భారీగా టీడీపీ, జనసేనల నుంచి వైఎస్సార్ సీపీలో చేరారని రాబోయే 2024 ఎన్నికల్లో కొత్తపేటలో గెలిచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇస్తామన్నారు. ఓవైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధి కార్యక్రమాలు నియోజకవర్గంలో భారీగా జరుగుతున్నాయన్నారు. ఎవరు ఎన్ని చెప్పినా ప్రజలు మాత్రం సీఎం జగన్ వైపే ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, జిల్లా వైఎస్సార్ సీసీ కార్యవర్గ సభ్యులు కొల్లి శ్యాంసన్, కరుటూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

వంట పాత్రల అందజేత

మామిడికుదురు: ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సూచించారు. నగరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు శనివారం జగనన్న గోరుముద్ద ద్వారా మంజూరైన వంట పాత్రలను ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ నిర్వాహకులు అందజేశారు. తాము చదువుకున్న రోజుల్లో ఎన్నో కష్టాలు పడి చదువుకున్నామని గతాన్ని గుర్తు చేసుకున్నారు. నేడు ఆ పరిస్థితి లేదని చెప్పారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను ప్రభుత్వమే అందిస్తుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చి వేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఇంగ్లిష మీడియం ప్రవేశపెట్టి ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, సర్పంచ్ జాలెం రమణకుమారి, కోఆప్షన్ సభ్యుడు నూర్జైన్ అబ్బాస్, ఉప సర్పంచ్ అన్వర్‌తాహిర్ హుస్సేన్, దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, జాలెం కృష్ణారావు, తాడి రామకృష్ణ, యూవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.


నగరంలో వంట పాత్రలు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

నిర్ణీత సమయానికి టీకాలు అందించాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల ఉప కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బంది శనివారం చిన్నారులకు టీకాలు, బాలింతలు, గర్భిణులకు బలవర్ధక ఔషధాలను అందజేశారు. వైద్యాధికారులు పి.భవానీశంకర్, ఆర్.మల్లికార్జున్, డి.సువర్చలాదేవి ఆధ్వర్యంలో ఆలమూరు-1, ఆలమూరు-2, పెనికేరు, పినపళ్ల, సూర్యారావుపేట, జొన్నాడ శివారు మూలాటిరేవు, చొప్పెల్ల శివారు శ్రీరామ్‌నగర్ కాలనీ, మడికి శివారు మల్లవానితోట, గుమ్మిలేరు గ్రామాల్లో అనేక మంది చిన్నారులకు ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది టీకాలను వేశారు. ఈ టీకాల ప్రక్రియను సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, ఆర్.బాలామణి పర్యవేక్షించారు. చిన్నారులకు ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు పెంటా వాలెంట్, ఎంఆర్, టీటీ, డీపీటీ, హెపటైటిస్-బీ వ్యాక్సిన్లను అందజేశారు. కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్యారోగ్య సిబ్బంది అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. కుష్ఠు వ్యాధి వ్యాప్తి, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఏర్పడితే సత్వరమే సమీప వైద్యారోగ్య సిబ్బందిని సంప్రందించాలని ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు కోరారు.


పినపళ్లలో గర్భిణులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

సీఎం పాలనలో ప్రతి కుటుంబం సంతోషమే..


రామేశ్వరంలో మహిళకు పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసే సంక్షేమ పథకాల లబ్ధితో ప్రతి పేద కుటుంబం సంతోషంగా ఉందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం రామేశ్వరంలో ఎమ్మెల్యే రాపాక, అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. సాంకేతిక కారణాల రీత్యా అర్హులకు పథకాలు అందకపోతే వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ, రాబోయే కాలంలో సీఎం జగన్ ప్రభుత్వం మరిన్ని పథకాలు పేదలకు అమలు చేస్తుందన్నారు. జగనన్న ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలన్నారు. సర్పంచ్ కట్టా ఉమా మహేశ్వరరావు, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ దొండపాటి సునీత, పార్టీ సీనియర్ నాయకుడు కేఎస్ఎన్ రాజు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, పార్టీ మండల ప్రెసిడెంట్ కుసుమ చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ పెదపాటి నాగలక్ష్మి, గ్రామ శాఖ అధ్యక్షుడు బళ్ల లక్ష్మణ్, నియోజకవర్గ బూత్ కమిటీల కో ఆర్డినేటర్ కె.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు


మామిడికుదురులో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మామిడికుదురు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శనివారం మామిడికుదురు గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. మామిడికుదురు ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ఈ నెల 20న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలో బహుమతులు అందిస్తామని గ్రంథాలయ నిర్వాహకుడు కె.సూర్యనారాయణ, బీడీసీ యెరుబండి కన్నబాబు తెలిపారు.

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేది పాలెం శాఖా గ్రంథాలయంలో శనివారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు విద్యార్థులకు వక్తృత్వం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయం పాత్ర, నిర్వహణ, ఉపయోగాలు అనే అంశాలపై లైబ్రేరియన్ వై.వెంకటలక్ష్మి పోటీలు నిర్వహించారు.

మలికిపురం: మండలంలోని కేశనపల్లి శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలు శనివారం నిర్వహించారు. విద్యార్థులకు గ్రంథాలయంలో వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలల నుంచి విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు 20న ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి కె.ఇందిర తెలిపారు.

రోడ్డుపై రాజకీయం చేయడం సిగ్గుచేటు

రాజోలు: స్థానిక బైపాస్ రోడ్డును రూ.90 లక్షలతో నిర్మిస్తే రోడ్డు నిర్మాణంపై జనసేన పార్టీ నాయకులు రాజకీయం చేయడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. శనివారం రాజోలులో విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే రెండు పర్యాయాలు బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మాత్రమే నిధులు మంజూరు చేశారన్నారు. గత పాలకులు ఎవరూ కనీసం రోడ్డు గుంతల్లో ఒక రాయి కూడా వేయలేదన్నారు. పవన్‌కల్యాణ్ వారాహి యాత్రకు ఏడాది ముందే రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించగా నిధులు కూడా మంజూరయ్యాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. గతంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఎలాంటి చర్యలు చేపట్టని పార్టీతో పొత్తు పెట్టుకుని జనసేన నాయకులు విమర్శలు చేయడం తగదన్నారు. సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మట్టా ఏడుకొండలు, గోగి రవీంద్ర, బొడ్డపల్లి ప్రసాద్, బొమ్మిడి ప్రసాద్, గొల్ల చిన్ని, బుంగ శ్రీను, స్టార్ శ్రీను, భాషా తదితరులు పాల్గొన్నారు.


రాజోలులో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అంతర్వేదిపాలెం-2లో ‘వై ఏపీ నీడ్స్ జగన్’

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలెం-2 సచివాలయం పరిధిలో శనివారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే (వై ఏపీ నీడ్స్ జగన్) డోర్ టూ డోర్ క్యాంపెయిన్‌ను వైఎస్సార్ సీపీ శ్రేణులు నిర్వహించారు. సర్పంచ్ నల్లి లీలావతి, పార్టీ మండల ప్రెసిడెంట్ కుసుమ చంద్రశేఖర్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నల్లి మోహన్ ఆధ్వర్యంలో నాయకులు క్యాంపెయిన్ చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, విజయాలను తెలియజేశారు. అలాగే 2014లో చంద్రబాబు, 2019లో జగనన్న చేసిన వాగ్దానాలు వినిపించి, నెరవేర్చినవి, నెరవేరని వాటిపై టిక్‌లు నిర్ణయించారు. వీటితో పాటు ఏపీకి జగనే ఎందుకు అవసరం బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. పార్టీ ఉపాధ్యక్షురాలు పెదపాటి నాగలక్ష్మి, మాజీ సర్పంచ్‌లు నల్లి సురేంద్ర, ఈద రవిరెడ్డి, నాయకులు నల్లి త్రిమూర్తులు, కోనపల్లి వెంకటేశ్వరరావు, కడలి సువర్ణ రాజు, మోకా ఏసురాజు, తాడి సహదేవ్, సచివాలయ కన్వీనర్, గృహసారథి, వలంటీర్లు పాల్గొన్నారు.